క్లుప్తంగా

నేడు గోకవరం మండలంలో బైక్ ర్యాలీ

గోకవరం: అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం గోకవరం మండలంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాస్‌రావు తెలిపారు. తంటికొండకు వెళ్లే మార్గంలో సీఎండీ కేఎస్‌పీపీ ఫిన్స్ లేఅవుట్ నుంచి చేపట్టే ఈ బైక్ ర్యాలీ గోకవరం మీదుగా పలు గ్రామాల్లో సాగుతుందన్నారు. ఉదయం లే అవుట్‌లో గణపతి హోమం, సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం భారీ అన్నదానం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీనిలో భాగంగా మండలంలోని పలు హిందూ దేవాలయాలకు సుమారు రూ.40 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు.

భూహక్కు చట్టంపై అవగాహన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో ఆదివారం భూహక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి దాసం శేషారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆ పార్టీ ఇంచార్జి వరుపుల తమ్మయ్యబాబు, ఐలాజ్ ప్రతినిధి బుగత శివ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. భూహక్కు చట్టం వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ఏపీ ప్రభుత్వం 2022లో తీసుకువచ్చిన భూహక్కు చట్టాన్ని (యాక్ట్ నెంబర్ 27/23) వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం వలన పేదలకు ఉపయోగం లేదన్నారు. కార్యక్రమంలో ఇందన ఏసుబాబు, నల్లల రామకృష్ణ, చల్లా లక్ష్మి, బొల్లు కొండబాబు, దొడ్డిపట్ల సామన్నదొర, సిద్దపురెడ్డి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పెంకుటిల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పెంకుటిల్లు

కోటనందూరు: మండలంలోని భీమవరపు కోట మాదిగపేటలో ఆదివారం తెల్లవారుజామున ఓ పెంకిటిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన శీలి దుర్గాభవానీ తన పెంకిటింట్లో తెల్లవారుజామున వంట చేస్తోంది. ఈ క్రమంలో మంటలు చెలరేగి ఇంటికి నిప్పంటుకుంది. ఇంటిలో ఉన్న టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, డైనింగ్ టేబులతో పాటు నిత్యావసరాలు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు బాధితులు తెలిపారు. వీఆర్వో సత్తిబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులకు 10 కేజీల బియ్యం అందజేశారు. సర్పంచ్ జిగటాల వీరబాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



రంగవల్లినగర్‌లో అగ్నిప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న హిజ్ మినిస్ట్రీస్ నేతలు

జగ్గంపేట: జగ్గంపేట శివారు రంగవల్లినగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని హిజ్ మినిస్ట్రీస్ నేతలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం బాధితులను పరామర్శించి వారికి దుస్తులు, వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, నగదు సాయం అందించారు. కార్యక్రమంలో హిజ్ మినిస్ట్రీస్ అధినేతలు సురేంద్ర, నీలు, పాస్టర్లు సుదర్శన్, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

- 366 మద్యం సీసాలు స్వాధీనం



పట్టుబడ్డన మద్యం సీసాలతో రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ

రౌతులపూడి: గ్రామ శివారు అంబికా దాబా అండ్ రెస్టారెంట్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు. అంబికా దాబా వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని నుంచి 366 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో బీరు సీసాలు 192, క్వార్టర్ బాటిళ్లు 129, బ్రాందీ సీసాలు 45 ఉన్నాయని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకటరమణ, రైటర్ బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు

బోనం సమర్పయామి..!

- కన్నులపండువగా నల్లగొండమ్మతల్లి బోనాల సంబరం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రత్యేక అలంకరణలో నల్లగొండమ్మతల్లి

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారు వేంపాడు మెట్ట వద్ద కొలువైన నల్లగొండమ్మతల్లి బోనాల మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక రామాలయం వద్ద వేలాది మంది బోనాలను శిరస్సున ధరించి ఊరేగింపును ప్రారంభించారు. శ్రమదానం రోడ్డుమీదగా కొత్త సూరవరం, తుని పట్టణం, ఎస్.అన్నవరంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం మీదుగా ఊరేగింపు ఆలయానికి చేరుకుంది. పెద్దసంఖ్యలో మహిళలు, యువతులు బోనాలను శిరస్సుపై ధరించి భక్తిశ్రద్ధలతో నల్లగొండమ్మతల్లి నామస్మరణ చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు సాంప్రదాయ కొమ్ము, థింసా నృత్యాలను ప్రదర్శించారు. ఎస్.అన్నవరం, తుని పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థం అంగరంగవైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల సంప్రదాయ భరతనాట్య నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ వంగలపూడి దొరబాబు, కార్యదర్శి వంగలపూడి ఫణి, కోశాధికారి వంగలపూడి జమీలు, నాయకులు వంగలపూడి మహేష్, వంగలపూడి బుజ్జి, కాంతారావు, గోవిందుబాబుతదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నల్లగొండమ్మతల్లి ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు



భరత నాట్యం చేస్తున్న చిన్నారులు



కొమ్ము, థింసా నృత్యాలను ప్రదర్శిస్తున్న గిరిజన కళాకారులు

దమ్ముంటే అంబేడ్కర్ విగ్రహాన్ని టచ్ చేసి చూడు..

- ధూళిపాళ్లకు జాన్‌వెస్లీ సవాల్

జగ్గంపేట: విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని దమ్ముంటే టచ్ చేసి చూడు అని పొన్నూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు ధూళిపాళ్ల నరేంద్రకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ సవాల్ విసిరారు. జగ్గంపేటలో ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే విజయవాడలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని కూలగొడతామని ధూళిపాళ్ల అనడం సరికాదన్నారు. ధూళిపాళ్ల ఎస్సీ, ఎస్టీలను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే ధూళిపాళ్ల రాజకీయ రంగ ప్రవేశం చేశాడని, అది మర్చిపోయి ఆగ్రహంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో పొన్నూరులో ధూళిపాళ్లకు డిపాజిట్ కూడా దక్కకుండా చేస్తామని హెచ్చరించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన ధూళిపాళ్లపై ప్రతి పోలీసుస్టేషన్లో కేసులు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఆరుగొల్ల పండు, గోరింట అప్పల రాజు, శ్రీమంతుల విజయభాస్కర్, బారింగుల నాగు, గుడాల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



జి.కొత్తపల్లి ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- జి.కొత్తపల్లి, కత్తిపూడిలో ఆత్మీయ సమావేశాలు

శంఖవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో గ్రామ సర్పంచ్ ఈగల విజయదుర్గ, కత్తిపూడిలో వైస్సార్ సీపీ నేత గాబు గంగ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో వరుపుల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకూ మేలు జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచులు సకురు గుర్రాజు, గొనగాల అప్పలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గింజాల కొండబాబు, ఈగల రాజు, కోన బాబ్జి, ఎడ్ల సత్యనారాయణ, ఈగల గంగ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా ఎంపికైన సుధీర్‌బాబుకు సత్కారం



ఎస్సైగా ఎంపికైన సుధీర్‌బాబును సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

ప్రత్తిపాడు రూరల్: ఇటీవల ఎస్సై రాతపరీక్షల్లో ప్రతిభ చూపి ఎస్సైగా ఎంపికైన రెడ్డిపల్లి సుధీర్ బాబు, అతని తల్లిదండ్రులు సత్యనారాయణ, రాఘవమ్మలను ఆదివారం ఘనంగా సత్కరించారు. మండలంలోని ధర్మవరం నూకాలమ్మతల్లి ఆలయం వద్ద సన్మాన సభ నిర్వహించారు. గ్రామానికి చెందిన వీర వేంకటవిజయదుర్గా నాట్య మండలి అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు పూలమాలలు, శాలువాతో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ సుధీర్ బాబు ఎస్సైగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు.యువత సుధీర్‌బాబును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పని చేసి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నానిపల్లి చంటి, యర్రాబత్తుల గోవిందనాయుడు, దొడ్డిపట్ల సోమన్నదొర, చింతా పెదకాపు, జాగు సూర్యనారాయణ, తూపాటి సత్తిరాజు, స్వయంబారపు రమణ తదితరులు పాల్గొన్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



తుని వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న చదరం శివాజీ

తుని: ప్రతిరోజూ కొంతదూరం నడిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని అంతర్జాతీయ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మురళీమోహనరావు అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ రోడ్డులోని రోటరీక్లబ్ భవనంలో ఆదివారం వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. క్లబ్ జిల్లా గవర్నర్‌గా చదరం శివాజీ, కార్యదర్శిగా కుందెం సత్యనారాయణ, కోశాధికారిగా కొమ్మోజు గౌరీశంకర్ ఎన్నికయ్యారు. వీరితో మురళీమోహనరావు ప్రమాణీ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మురళీమోహనరావు మాట్లాడుతూ తుని వాకర్స్ క్లబ్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంతర్జాతీయ మాజీ గవర్నర్ కోడూరి రంగారావు, ఎం.ప్రభావతి, ఎస్.ఐజాక్, సత్యానందం, అభిమన్యు నాయక్, సాయిరాం, కలిదిండి సత్యనారాయణరాజు, కుచ్చర్లపాటి భీమరాజు, దణ్యంరాజు సత్యసాయి, చోడిశెట్టి త్రిమూర్తి స్వామి, రెడ్డి రత్నం తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

రైల్వే పెన్షనర్ల సంఘం డిమాండ్



సీనియర్ పెన్షనర్లను సత్కరించిన సంఘ ప్రతినిధులు

సామర్లకోట: కొత్త పెన్షన్ విధానం కారణంగా విశ్రాంత రైల్వే ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని రైల్వే పెన్షనర్ల 12వ సర్వసభ్య సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక రైల్వే పెన్షనర్ల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌సింగ్ రాజ్‌పుత్ అధ్యక్షతన ఆదివారం స్థానిక రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. విశ్రాంత రైల్వే ఉద్యోగులు, కార్మికులకు అండగా ఆలిండియా రైల్వే పెన్షనర్ల సంక్షేమ సంఘం పని చేస్తుందని విజయవాడ డివిజన్ అధ్యక్షుడు పి.రామ్‌గోపాల్ అన్నారు. సంఘ డివిజన్ కార్యదర్శి ఎ.కామేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల కంటే పెన్షనర్లకు ఎక్కువ సమస్యలుంటాయని తెలిపారు. కేంద్ర పెన్షన్ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సంఘ అధ్యక్షునిగా ఎంవీవీ రమణ, ప్రధాన కార్యదర్శిగా ఎల్ఎస్ రాజ్‌పుత్, కోశాధికారిగా ఎస్‌వీవీ సత్యనారాయణతో పాటు, మరో ఏడుగురు సభ్యులను కొనసాగించేలా సమావేశం తీర్మానించింది. అదే విధంగా సెకండరీ ఫామిలీ పెన్షన్ పెండింగ్ కేసులు పరిష్కరించాలని కోరింది. పెన్షన్‌దారుడు మరణిస్తే భార్యకు పెన్షన్, అర్హత ఉన్న కుటుంబ సభ్యులకు పెన్షన్ అందజేయాల్సి ఉండగా, ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఫ్యామిలీ మెంబర్స్ అలెవెన్సు రూ.మూడు వేలు ఇవ్వాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను వేగంగా పరిష్కరించాలని డిమాండ్ చేసింది. రైల్వే ఆస్పత్రుల్లో అందని వైద్యం, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేయించుకుంటే, ఫీజులో 20 శాతమే ఇవ్వ డం దారుణమని పేర్కొంది. కార్యక్రమంలో డివిజన్ కోశాధికారి సీహెచ్ కృపయ్య, ఉపాధ్యక్షుడు టి.త్రినాథ్, కాకినాడ బ్రాంచి సంఘ నాయకులు కేవీ రమణరావు, పి.రామ్ గోపాల్, ఎ కామేశ్వరరావు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను ఘనంగా సత్కరించారు.

అంతా రామమయం

- వైభవంగా అయోధ్య రాముని శోభాయాత్ర
- గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు



ఏలేశ్వరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఏలేశ్వరం: అయోధ్య రామ మందిరంలో బాల రాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఏలేశ్వరం పట్టణంలో ఆదివారం శ్రీరాముని శోభాయాత్ర నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, భభజరంగదళ్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పలు భజన బృందాలు, మహిళలు, భక్తులు శ్రీరాముని జెండాలు చేతబూని జైశ్రీరామ్ నినాదాలతో శోభాయాత్ర చేశారు. పట్టణంలోని బాలాజీ చౌక్, మెయిన్ రోడ్, లింగంపర్తి రోడ్, షిర్డీ నగర్ తదితర ప్రాంతాల మీదుగా యాత్ర సాగింది. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సోమవారం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు విశ్వహిందూపరిషత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు కటకం కిరిటీ, గొల్లపూడి సత్యనారాయణ, గొల్లపూడి గణేష్, కురాకుల రాజా, గట్టెం వెంకటరమణ, మహిళలు పాల్గొన్నారు.

కిర్లంపూడి: అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఆదివారం పలు గ్రామాల్లో రామభక్తులు కాషాయ జెండాలు పంపిణీ చేశారు. కిర్లంపూడిలో బాదంపూడి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి 300 కాషాయ జెండాలు, అక్షతలు, సింధూరం పంపిణీ చేశారు. శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ఆలయాలు, ఇళ్లలో ప్రత్యేక పూజలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బాదంపూడి నారాయణమూర్తి, కురుమళ్ల విష్ణు, తూము కల్యాణ్ చక్రవర్తి, శరకణం మణికంఠ, గంటా రామకృష్ణ, బషీర్, మీరా సాహేబ్ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చియ్యపేటలో సీతారాములను ఊరేగిస్తున్న భక్తులు



కిర్లంపూడిలో కాషాయ జెండాలు పంపిణీ చేస్తున్న రామభక్తులు

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షతల పంపిణీ

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ బుచ్చియ్యపేట, ఆవులమంద తదితర గ్రామాల్లో ఆదివారం ఇంటింటికీ అయోధ్య రాముని అక్షతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు, రామ భక్తులు సీతారాముల విగ్రహాలను పల్లకీపై గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అయోధ్య నుంచి వచ్చి శ్రీరాముని అక్షతల పంపిణీ చేశారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం ఈ అక్షతలను శిరస్సుపై వేసుకోవాలని సూచించారు. అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఇప్పటికే గ్రామాల్లో రామాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం సీతారాముల కల్యాణోత్సవాలతో పాటు అన్నదానం భజనలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

నేడు అయోధ్య రాముని అక్షతల పంపిణీ

తుని: స్థానిక గణపతినగర్ పార్కులో సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం అయోధ్య రాముని అక్షితలు పంపిణీ చేయనున్నట్టు వాకర్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అయోధ్య శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను భక్తులు స్వీకరించాలని ఆయన కోరారు.

యోగా గురువు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కిర్లంపూడి: బూరుగుపూడిలోని ప్రభుత్వ ఆయుష్ ఆయుర్వేద వైద్యశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు యోగా టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆసుపత్రి డాక్టర్ ఎం.నీరజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నెలలో పురుషులు 32, స్త్రీలు 20 గంటలు పనిచేయవలసి ఉంటుందన్నారు. డిగ్రీ, పీజీ, డిప్లమా చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు గంటకు రూ.250 చొప్పున గౌరవ వేతనం ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 92466 38195 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యాదవులు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాదవ సంక్షేమ సంఘ నాయకులు

శంఖవరం: యాదవులు అందరూ ఐక్యంగా ఉండాలని యాదవ సంక్షేమ సంఘం నేతలు సూచించారు. మండలంలోని సీతంపేటలో ఆదివారం యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు యాదవులకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలన్నారు. యాదవులు ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అల్లు రాజుబాబు, కోయ్యా శ్రీను, గొంప శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణరాజు



కె.గోపాలపురంలో ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తున్న సూర్యనారాయణరాజు

గండేపల్లి: గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర స్టేట్ కో ఆర్డినేటర్ వేటుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. మండలంలోని కె.గోపాలపురం, ఎన్టీ రాజాపురం గ్రామాల్లో ఆదివారం వికసిత్ సంకల్ప యాత్రపై అవగాహన సదస్సులు నిర్వహించారు. తొలుత సంకల్పయాత్ర రథానికి మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ, బాలికా సురక్ష, నిరుపేదలకు ఉచిత బియ్యం పంపిణీ, ఆవాస యోజన తదితర పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు వత్సవాయి వరాలబాబు, కామినేని జయశ్రీ, స్టేట్ కౌన్సిల్ సభ్యులు గారపాటి రాజేశ్వరరావు, బీజేపీ మండలాధ్యక్షుడు తోరాటి వెంకన్న, ఎంపీడీఓ రామన్, తహసీల్దార్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

నిరాడంబరంగా ఓంకారస్వామి జయంతి



శాంతిఆశ్రమంలో ఓంకార స్వామి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వెంకటనగరం పంచాయతీ పరిధిలోని తోటపల్లి కొండల్లోని శ్రీశాంతి ఆశ్రమ వ్యవస్థాపకులు ఓంకారస్వామి జయంతి వేడుకలు ఆదివారం నిరాడంబరంగా జరిగాయి. ఓంకార స్వామి చిత్రపటానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జయంతి వేడుకల్లో వృషికేషి పీఠాధిపతి పద్మనాభనంద సరస్వతీ స్వామి, శాంతిఆశ్రమ పీఠాధిపతి మాతాజ్ఞానేశ్వరీదేవి, వినంబ్రనంద మాతాజీ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు రద్దు పట్ల భక్తుల అసంతృప్తి

శ్రీశాంతిఆశ్రమ వ్యవస్థాపకులు ఓంకార స్వామి జయంతి వేడుకలను నాలుగేళ్ల క్రితం వరకూ ఆశ్రమ నిర్వాహకులు అంగరంగవైభవంగా నిర్వహించేవారు. ఈ వేడుకలకు జిల్లా నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చేవారు. కాగా గత నాలుగేళ్లగా కరోనా, అనివార్య కారణాల వేడుకలను ఆశ్రమ నిర్వాహకులు రద్దు చేయడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

- సీనియర్ ఐఏఎస్ పీయూష్ కుమార్ రాక
- కమిషనర్ నాగ నరసింహారావు వెల్లడి

కాకినాడ: ప్రధాని మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరిట అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. స్థానిక వివేకానంద పార్క్ ఆవరణలోని రాగిరెడ్డి కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ ఏర్పాట్లను వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి కమిషనర్ నాగనరసింహారావు ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కామర్స్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి పియూష్ కుమార్, ఎంపీ వంగా గీత విశ్వనాథ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నారన్నారు. కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. లబ్ధిదారులు కూడా పాల్గొని, తమ మనోగతాన్ని వెల్లడిస్తారన్నారు. దాదాపు 15 కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగేశ్వర్ నాయక్, గృహ నిర్మాణ శాఖ డీఈ సత్యనారాయణ రెడ్డి, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.